క్లుప్తంగా

జోరుగా సాగుతున్న ప్రచారం

కొత్తూరు: ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్ది మండలంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. బుధవారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో పర్యటించి తమతమ మెనిఫెస్టోలను ప్రజలకు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరినాథ్‌రెడ్డి, జె. సుదర్శన్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, పాశం కృష్ణ, శ్రీను, ప్రవీణ్‌రెడ్డి, హసన్, రాజు, పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్ యాదవ్, మాధవరెడ్డి, యాదయ్య, భాస్కర్, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

కొందుర్గు: చౌదరిగూడలో టైలర్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. మృతుడు చౌదరిగూడ ఎస్‌బీఐలో బీమా చేయడంతో బ్యాంకు వారు అతడికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఎస్‌బీఐ రీజినల్ చీఫ్ మేనేజర్ నరేంద్రనాథ్ రెడ్డి మృతుడి భార్య లక్ష్మికి రూ.10లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీమా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏరియా మేనేజర్ సాయిరాం, బ్రాంచ్ మేనేజర్ భారతి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత


నోట్ పుస్తకాలు అందజేసిన శ్రీరామ్ యూత్

కేశంపేట: మిత్రుడి జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. బోధునంపల్లి గ్రామంలో వడ్డేమోని ఆనంద్ వర్ధంతి సందర్భంగా శ్రీరామ్ యూత్ సభ్యులు, తోటి మిత్రులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హరీశ్, విజయ్, కుమార్, చింటు, వంశీ, గణేశ్, విష్ణు, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేద్దాం

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ చౌరస్తాలో నిర్వహించబోయే కేటీఆర్ రోడ్‌షోను విజయంతం చేద్దామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కొంపల్లి అనంత రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రానున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రావూఫ్, రవియాదవ్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కి బ్రహ్మరథం పడుతున్నారని, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కేతిరెడ్డిపల్లి, కంచమానిగూడ, చాకలిగూడ ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఉపసర్పంచ్ సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్‌లో చేరిక

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు బుధవారం ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నాయకుడు వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

షాద్‌నగర్ బరిలో 14 మంది

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- ఏడుగురి ఉపసంహరణ
- చేవెళ్ల బరిలో 12 మంది
- హోరాహోరీగా సాగనున్న ప్రచారం


నామినేషన్ ఉపసంహరణ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న అందె రాజేశ్వర్


చేవెళ్ల: నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటున్న కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. బరిలో నిలబడే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. దీంతో షాద్‌నగర్ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగనుంది. ఈ సారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు తమ అస్త్రశస్త్రాలను ఉపయోగించి ప్రచారంలో నిమగ్నం కానున్నారు. దీంతో షాద్‌నగర్‌లో బిగ్ ఫైట్ తప్పదు.

24మందిలో బరిలో14 ..

ప్రస్తుతం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో షాద్‌నగర్ నియోజవర్గ స్థానానికి ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 24 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం 14 మంది బరిలో నిలిచారు. బీఆర్‌ఎస్ నుంచి అంజయ్య యాదవ్, కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్, బీజేపీ నుంచి అందెబాబయ్య, ఆల్‌ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ నుంచి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, బీఎస్పీ నుంచి ప్రశాంత్‌కుమార్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి వినయ్‌కుమార్, ధర్మసమాజ్ పార్టీ నుంచి మంచాల భిక్షపతి, స్వతంత్ర అభ్యర్థులుగా తుప్పుడు నర్సయ్య, మంచాల చంద్రమౌళి, నర్సింహ్మా రుస్తుం, అందారి అంజయ్య, రాఘవేందర్, ఆల్ ఇండియా సమతా పార్టీ నుంచి రహముద్దీన్, జై స్వరాజ్ పార్టీ నుంచి మహ్మద్ ఖాజా ముఫిజుద్దీన్‌లు బరిలో నిలిచారు.

ఉపసంహరించుకున్నది వీరే...

నామినేషన్లు వేసి ఉపసంహరించుకున్న వారిలో అందె రాజేశ్వర్, సింగపాగ శివకుమార్, ఆలుగడ్డ ప్రవీణ్, ఆలుగడ్డ ఇందిర, పల్లె సత్యనారాయణరెడ్డి, మఠం శశిధర్, ఎమ్మె సత్యనారాయణలు ఉన్నారు.

ప్రచారంలో పాల్గొననున్న అభ్యర్థులు..

షాద్‌నగర్‌లో ప్రచారం హోరా హోరీగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు విస్తృతంగా పర్యటనలు కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రజలను ఆకట్టుకునే విధంగా తమ ప్రచారాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా ప్రత్యర్థి పార్టీలోని బలహీనతలను ఆసరా చేసుకుంటూ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. ఉదయం మొదలు రాత్రి వరకూ క్షణం తీరిక లేకుండా అభ్యర్థులు విస్తృతంగా పర్యటనలు కొనసాగిస్తూ ప్రజల మధ్యనే ఉంటున్నారు. అయితే ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఎన్నికల్లో గెలుపెవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

చేవెళ్లలో మూడు..

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజున ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. నామినేషన్ల స్క్రూటీని తరువాత 15 మంది అభ్యర్థులు ఉండడంతో అందులో నుంచి ముగ్గురు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. విత్‌డ్రాల చివరి రోజున కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం, స్వతంత్ర అభ్యర్థి కాలె శ్రీకాంత్, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి బేగరి రాఘవేందర్‌లు విత్‌డ్రా చేసుకున్నారు. ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు మిగిలారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి


టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి షాబాద్: రైతులు మూగ జీవాలకు అమ్మతల్లి వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశు వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాళ్లపల్లి, మద్దూరు, సాయిరెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి మూగ జీవాలకు అమ్మతల్లి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు అమ్మతల్లి నివారణా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి జీవాలకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


వేడుకలో సినీనటుడు నాగినీడు

వనస్థలిపురం: చింతలకుంటలోని వాసవి శ్రీ నిలయం గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం రాత్రి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటుడు వి.నాగినీడు చదువు, నడవడిక, భవిష్యత్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. గొర్రెపాటి నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా భువనగిరి జిల్లా సీనియర్ సెషన్స్ జడ్జి మురళీమోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో చిన్నారులు వైష్ణవి, మేడిని, ధృవ, అపూర్వ, హాస్య, సంప్రీతి, తీర్థ, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

లక్ష్మమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

- పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: సీసీ రోడ్డు నిర్మాణం విషయంలో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన లక్ష్మమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఆయన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, పార్టీ నాయకుడు అందె మోహన్‌తో కలిసి బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో బీజేపీ, బీఎస్పీ నాయకులు అందె బాబయ్య, ప్రశాంత్ తదితరులున్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

- సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్


వేడుకల్లో పాల్గొన్న సంఘం నాయకులు

తుర్కయంజాల్: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఇంజాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. సంఘం 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఇంజాపూర్‌లో సంఘం జెండాను ఆవిష్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రామదాసు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి జగన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గోదా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్: గోవిందాయిపల్లి తండాకు చెందిన నాజీ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని బీజేపీ గిరిజన మోర్చా నాయకుడు సాయిలాల్ నాయక్ పరామర్శించి రూ.5వేలు సాయం అందించారు. మాన్య నాయక్, నరేందర్, రెడ్యానాయక్, పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఉలిగొండ చంద్రయ్య ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మృతుడి భార్యకు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తి బరిలో 24 మంది

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం బరిలో 24 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 27 మంది అభ్యర్థులు బరిలో ఉండగా నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు బుధవారం కానుగుల జంగయ్య, కట్టజంగయ్య, పి.అంజనేయులు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం 24 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల అధికారి శ్రీను ప్రకటించారు. కల్వకుర్తిలో ఆచారి(బీజేపీ), కసిరెడ్డి నారాయణరెడ్డి(కాంగ్రెస్), కొమ్ము శ్రీనివాసులు(బీఎస్పీ), గుర్క జైపాల్‌యాదవ్(బీఆర్‌ఎస్), అమర్‌నాథ్, శ్రీను, చంద్రస్వామి, జటావత్ రాంచందర్, తిరుపతమ్మ, పాలాది కిరణ్‌కుమార్, పోతర్లపల్లి శేఖర్, పాండురంగయ్య, బాదేపల్లి రాజుగౌడ్, బూర్య, పద్మ, వగ్గు వినయ్, వంకేశ్వరం రమేశ్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో బూత్‌ల పంచాయితీ

- ఎన్నికల బూత్‌ల బాధ్యత కోసం పాత – కొత్త నాయకుల మధ్య గొడవ
- పరస్పరం దాడి చేసుకున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: బూత్‌ల కోసం టీఆర్‌ఎస్ నాయకులు గొడవకు దిగారు. ఒకరినొకరు బూతులు తిట్టుకుంటూ పరస్పరం దాడి చేసుకున్నారు. వివరాలు... ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్‌లో ముందు నుంచి ఉన్న నాయకులు, కొత్త నాయకుల మధ్య వివాదం నడుస్తోంది. ఎన్నికల బూత్‌ల బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న చర్చ జరగడంతో పాత, కొత్త నాయకుల మధ్య వివాదం మొదలైంది. బూత్‌ల బాధ్యత మాకు కావాలంటే... కాదు మాకే కావాలని వాగ్వాదానికి దిగారు. మొదట చిన్నగా ప్రారంభమైన గొడవ చినికి చినికి గాలివానగా మారి నాయకులు కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. దీంతో రంగంలోకి దిగిన నియోజకవర్గ స్థాయి నాయకులు కొందరు వారిని మందలించి గొడవ సద్దుమణిగేలా చేశారు. రానున్న రోజుల్లో ఈగొడవ ఎక్కడి వరకు వెళ్తుందోనని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి లంగిడి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు జాతీయస్థాయి లంగిడి పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రంలోని థాణెలో జరిగే జాతీయస్థాయి లంగిడి పోటీల్లో స్పందన, స్వాతి, శివాని, విజయ ఎంపికైనట్లు పాఠశాల పీడీ సునీల తెలిపారు.

తల్లిపాలు శిశువులకు అమృతం లాంటింది

- డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి


బాలింతతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నందిగామ: తల్లి పాలు శిశువులకు అమృతం లాంటిదని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని నర్సప్పగూడను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు జాతీయ నవజాత వారంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఈ వారం రోజుల్లో అప్పుడే పుట్టిన బిడ్డల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ గురించి వారి తల్లులకు వివరించాలన్నారు. పిల్లలకు స్నానం చేయించే విధానం, పాలు పట్టే విధానం, దుస్తులు గురించి తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కాన్పు అయిన అరగంట తరువాత వెంటనే శిశువుకు తల్లి ముర్రుపాలు తాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికిషన్, డాక్టర్ జాన్సీ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్ వైజర్ రవి కుమార్, ఏఎన్ఎం రేణుక తదితరులు పాల్గొన్నారు.

పట్నం బరిలో 28 మంది

ఇబ్రహీంపట్నం: నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగిసింది. ఇబ్రహీంపట్నం నుంచి 39 మంది అభ్యర్థులు 58 సెట్ల నామినేషన్ల వేయగా అందులో నాలుగు తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. 35 మంది అభ్యర్థుల్లో ఏడుగురు ఉపసంహరించుకున్నారు. టీపీసీఐ అభ్యర్థి మాధవరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు కార్తీక్ కుమార్, మహేందర్, పద్మనాయక్, రాంరెడ్డి, చిక్కుడు, డబ్బీకార్ శ్రీనివాస్ ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. గొరిగే మల్లేష్ (బీఎస్పీ), నోముల దయానంద్ (బీజేపీ), పగడాల యాదయ్య (సీపీఐఎం), మల్‌రెడ్డి రంగారెడ్డి (కాంగ్రెస్), మంచిరెడ్డి కిషన్‌రెడ్డి(బీఆర్‌ఎస్), అమిరెడ్డి సందీప్‌రెడ్డి (విద్యార్థుల రాజకీయ పార్టీ), కే.కిషన్‌రెడ్డి(ఏడీఆర్‌పీ), గొనుకొండ పృథ్వీరాజ్(టీఆర్పీ), చీమల కళావతియాదవ్(బీసీవైపీ), జయంత్ ప్రసాద్ నాయుడు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), తులసిగారి రవీందర్(ధర్మసమాజ్ పార్టీ), ప్రతాప్ సింహరాయిడు (తెలంగాణ జాగీర్ పార్టీ), బచిగ్గాళ్ల సైదులు(ప్రజా వెలుగు పార్టీ), యంపల్ల సుధాకర్‌రెడ్డి(యుగ తులసి పార్టీ), వి.సదానంద రెడ్డి (పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ), సయ్యద్ సిద్‌ఖులా హుస్సేనీ (ఇండియా ప్రజాబంధు పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా కొత్త శంకర్‌రెడ్డి, బాలచందర్, పరీక్షిత్‌రెడ్డి, శివ, రవి, రాజ్యలక్ష్మి, మురళి, రవీందర్‌రెడ్డి, సాయికిరణ్, నరేందర్‌రెడ్డి, దేవరాం, వెంకట్‌రాం రెడ్డి తుది ఎన్నికల బరిలో ఉన్నారు.

కాగా ఎన్నికల గుర్తుల కేటాయింపు కోసం ఎలక్షన్ కమిషన్ అనుమతికి జాబితాను పంపినట్లు ఆర్‌ఓ తెలిపారు.

ఆడబిడ్డలా ఆదరించండి

కారు గుర్తుకు ఓటేయండి

- మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మకండి
- అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం
- మంత్రి సబితారెడ్డి
- కందుకూరు మండలంలో ఎన్నికల ప్రచారం

కందుకూరు: ఆడబిడ్డలా తనను ఆదరించి మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అభ్యర్థించారు. కులం, మతం పేరుతో ఓట్ల కోసం వచ్చే పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి కేసీఆర్ పాలన వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. బుధవారం మండల పరిధిలోని 11 గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తుందన్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో సామాజిక పెన్షన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, మిషన్‌భగీరథ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. రూ.660 కోట్లతో శంషాబాద్ మీదుగా కందుకూరు, ముచ్చర్ల గేట్ వరకు మెట్రో రైలు ఏర్పాటు చేయనున్నారని, మీర్‌ఖాన్‌పేట వద్ద 450 పడకల ఆస్పత్రి, కళాశాల ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. లావణ్య పట్టాలకు అన్ని హక్కులు కల్పిస్తామని, దీంతో ఆ భూము లున్న పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, జయమ్మ రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ పాండు, కె.దశరథ, పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న సబితారెడ్డి తదితరులు

నిలువ నీడ కరువు

- కడ్తాల్‌లో బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు
- రోడ్డుపైనే ఆర్టీసీ వాహనాల నిలుపుదల
- తరుచూ ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆర్టీసీ బస్సు

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు కలగానే మిగిలింది. దీనికి తోడు బస్‌షెల్టర్లు ఒకచోట బస్సులు మరోచోట నిలుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. కడ్తాల్ ప్రధాన రహదారిపై గతంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న బస్‌షెల్టర్ ఉండేది. అందులో పది నుంచి పదిహేను మంది ప్రయాణికులు వేచి ఉండేందుకు స్థలం ఉండేది. ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంతో ఆ బస్ షెల్టర్‌ను కూల్చివేశారు. దాని స్థానంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ బస్సులు నిలపని రెండు ప్రదేశాల్లో రెండు బస్‌షెల్టర్లు నిర్మించాడు. అయితే అక్కడ ఆర్టీసీ వారు బస్సులు నిలుపడం లేదు. దీంతో షెల్టర్లు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. కడ్తాల్ ప్రాంతం వాణిజ్య, వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నా ప్రయాణికులకు మాత్రం నిలువనీడ మాత్రం కరువైంది. బస్సులు నిలపని చోట షెల్టర్లు నిర్మించడంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు షెల్టర్ల వద్ద బస్సు నిలుపుతారేమేనని అక్కడ నిలబడితే, బస్సులు మరోచోట నిలబెడుతుండటంతో వారికి ఉరుకుల పరుగుల కష్టాలు తప్పడం లేదు.

షెల్టర్ల దగ్గర ఆగని బస్సులు..

గతంలో రోడ్డు విస్తరణ చేపట్టకముందు కనీసం బస్సుల కోసం వేచి ఉండటానికి ప్రధాన రహదారి పై చెట్లైనా ఉండేవి. రోడ్డు విస్తరణ పనులతో గ్రామంలో నిలువ నీడ కరువై.. ఎండకు, వానకు, దుమ్ముకు ధూళికి బస్సుల కోసం నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలో రెండు కిలోమీటర్ల మేరకు 4 లేన్ల రహదారిగా విస్తరించారు. విస్తర్ణలో భాగంగా గతంలో ఉన్న షెల్టర్ కూల్చి, వేరోచోట మరో రెండు షెల్టర్‌లు నిర్మించారు. గతంలో బస్సులు నిలిపే ప్రదేశంలో బస్‌షెల్టర్ ఉండేది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ వద్ద బస్సులు, నిలపకపోవడంతో బస్‌షెల్టర్‌లు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ప్రధాన రహదారిపై గుక్కెడు నీళ్లు కూడా కరువే. గ్రామ పంచాయతీ వారు ఎలాంటి నీటివసతి ఏర్పాటు చేయకపోవడంతో దుకణాల్లో వాటర్ బాటిల్స్ కొనుక్కొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నిత్యం రద్దీగా..

మండల కేంద్రం మీదుగా నిత్యం వందలాది బస్సులు తిరుగుతుండటంతో రహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ప్రైవేట్ వాహనాలు కూడా రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను చేరవేస్తుండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్డు పక్కన నిలబడవలసిందే. ఇప్పటికైన వేగంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులతో పాటు, అధికారులు దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా షెల్టర్లు



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ల వద్ద బస్సులు నిలపడంలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. పెరిగిన వాహనాలకు అనుగుణంగా మండల కేంద్రంలో రోడ్డు విస్తరణతో పాటు అధునాతన బస్టాండ్ ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా దృష్టిసారించాలి.

– శివ, కడ్తాల్

బస్టాండ్ ఏర్పాటు చేయాలి



వేగంగా అభివృద్ధి చెందుతున్న కడ్తాల్ మీదుగా వందలాది బస్సు సర్వీసులు తిరుగుతున్నా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అక్కరకురాని చోట బస్‌షెల్టర్లు నిర్మించిన అధికారులు.. ప్రయాణికుల ఇబ్బందులు వెంటనే గుర్తించాలి. ప్రయాణికులు అవసరాల దృష్ట్యా మండల కేంద్రంలో అధునాతన బస్టాండ్ ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ, కడ్తాల్